# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

సంగారెడ్డి 5 మెదక్

శనివారం 6 సెప్టెంబరు 2025

జిల్లాల వార్తలు






వనదుర్గామాత ఆలయ సన్నిధిలో కొనసాగుతున్న వరద

## ఇంకా.. వరదలోనే వనదుర్గ

### దూపదీప నైవేద్యాలకు దూరం

పాపన్నపేట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఇంకా వరద ప్రవాహంలోనే ఉంది. మూడు వారాలుగా ఆలయం మూసి ఉంచడంతో అమ్మవారికి దూపదీప నైవేద్యాలు దూరమయ్యాయి. సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో వనదుర్గ ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంటుంది. వరదల సమయంలో రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఉంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. గత నెల 14 నుంచి వరద కొనసాగుతున్నది. ప్రధాన ఆలయం మూసి ఉండటంతో ఆలయ ఆదాయం పైనా ప్రభావం పడుతున్నది. ఆలయంలో సాధారణ రోజుల్లో రోజూ ప్రసాదాల విక్రయం ద్వారా సుమారు రూ.80 వేలు, ప్రత్యేక దర్శనం టికెట్‌తో రూ.20 వేలు, హుండీలు రూ.50 వేల ఆదాయం ఉంటుంది. ప్రతీ ఆదివారం రూ.4 లక్షల వరకు రాబడి ఉండేది. ప్రస్తుతం అన్నీ కలిపి రూ.30వేల లోపే ఆదాయం వస్తోంది. గుడి మూసివేసిన వేసిన రోజులను లెక్కిస్తే 2021లో 32 రోజులు, 2022లో 40 రోజులు, 2023లో 14రోజులు, 2024లో 33 రోజులు, 2025లో 23 రోజులు తాత్కాలికంగా మూసివేశారు. గరిష్ఠగా 2016లో 45 రోజులు గుడి మూసి ఉంచారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆలయం వద్ద 80వేల క్యూసెక్కుల వరద పరుగులు పెట్టింది.



## ఐఐటీహెచ్.. మరో మైలురాయి

- అత్యుత్తమ విద్యాసంస్థల జాబితాలో చోటు
- ఎన్‌ఐఆర్‌ఎఫ్-2025 ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానం
- ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో 12 స్థానం కైవసం

7

## ఇద్దరు పిల్లల గొంతు నులిమి.. తల్లి ఆత్మహత్య

6

## జయా-చైతన్యరెడ్డిలను ఆశీర్వదించిన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

### సంగారెడ్డిలోని ఇంటికి వచ్చి కొత్త దుస్తులు పెట్టి ఆశీర్వదించిన దత్తాత్రేయ

### సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా అడిగి ఆయన కోటాలో నిర్మలకు కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారని దత్తాత్రేయకు వివరించిన జగ్గారెడ్డి



నూతన దంపతులు జయా-చైతన్య రెడ్డిలను ఆశీర్వదిస్తున్న హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వివాహం జరిగిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డిల కూతురు జయ, అల్లుడు గుణ చైతన్యరెడ్డిలను హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆశీర్వదించారు. సంగారెడ్డిలోని వారి నివాసానికి శుక్రవారం విచ్చేసిన దత్తాత్రేయ నూతన వధూవరులకు కొత్త దుస్తులు పెట్టి ఆశీర్వదించారు. అనంతరం దత్తాత్రేయ రచించిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని జగ్గారెడ్డికి అందజేశారు. అక్టోబరు 3న హైదరాబాద్‌లో జరగనున్న అలయ్-బలయ్ కార్యక్రమానికి హాజరు కావాలని జగ్గారెడ్డి దంపతులను దత్తాత్రేయ ఆహ్వానించారు. జగ్గారెడ్డి-దత్తాత్రేయల మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. దత్తాత్రేయతో తనకున్న అనుబంధాన్ని జగ్గారెడ్డి గుర్తు చేసుకున్నారు. మీరు చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకుని తాను కూడా పార్టీలకు అతీతంగా సేవలు చేస్తున్నానని జగ్గారెడ్డి తెలిపారు. లాలాగూడ రామాలయంలో దత్తాత్రేయ సమక్షంలోనే తమ పెళ్లి జరిగిందని జగ్గారెడ్డి తెలిపారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మీరు పార్టీ కోసం ఎంతో పని చేశారన్నారని చెప్పారని జగ్గారెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రొటోకాల్ సమస్య తలెత్తకుండా సీఎం కోటాలో తన సతీమణి నిర్మలారెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ ఇస్తానని చెప్పారన్నారు. ఈ పదవి సీఎంగా తన కోటాలోనే ఇస్తున్నానని, రాహుల్‌గాంధీకి కూడా ఇదే విషయం చెబుతానని సీఎం చెప్పారని జగ్గారెడ్డి దత్తాత్రేయకు వివరించారు. నిర్మలకు టీజీఐఐసీ చైర్మన్ ఇవ్వాలని కోరగానే ఇచ్చానన్నారు. అప్పట్లో దత్తాత్రేయతో కలిసి పనిచేసిన సంగారెడ్డికి చెందిన పన్యాల ప్రభాకర్, బీహెచ్‌ఈఎల్ అంజయ్య, తోపాజీ అనంత కిషన్, మిఠాయి నారాయణ, వీరన్న విఠల్‌గౌడ్, జెస్త నర్సింగ్ తదితరుల గురించి వారు గుర్తు చేసుకున్నారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూదిన మెతుకుసీమ వైపు మరోసారి రాష్ట్రమంతా ఆసక్తిగా చూస్తోంది. ఇటీవల కాలంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు ఉమ్మడి మెదక్ జిల్లా నేపథ్యమే కేంద్రంగా మారింది. బీఆర్‌ఎస్ పుట్టుకతో మొదలుకుని కన్నకూతురు కవితను ఏకంగా ఆ పార్టీ నుంచి కేసీఆర్ సస్పెన్షన్ చేసేదాకా అనేక అంశాలు ఈ ప్రాంతంతో ముడిపడి ఉండడమే ఇందుకు కారణం. రాష్ట్రమంతటా రాజకీయ చర్చ జరుగుతున్నప్పటికీ మెతుకుసీమలో మాత్రం ఉద్వేగపూరిత వాతావరణం నెలకొన్నది. ఇక్కడి నుంచే తన ప్రస్థానాన్ని ప్రారంభించి అనేక ఎత్తుపల్లాలు చవిచూసిన కేసీఆర్ భవిష్యత్ వ్యూహాలపైనే సర్వత్రా దృష్టి నెలకొంది. ఇటీవల కాలంలో రాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఓ వైపు కాళేశ్వరంపై సీబీఐ విచారణ చేపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం.. మరోవైపు హరీశ్‌రావు, సంతోష్‌రావుపై కవిత ఆరోపణలు చేయడం.. చివరకు బీఆర్‌ఎస్ నుంచి కవితను సస్పెండ్ చేయడం క్షేత్రస్థాయిలో హాట్‌టాపిక్‌గా మారాయి. ఈ పరిణామాలు అన్ని వర్గాలను ఆకర్షించడంతో ఉద్యమగడ్డగా పేరొందిన మెతుకుసీమ చుట్టే మళ్లీ రాజకీయాలు తిరుగుతున్నాయి.

- సిద్దిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



# మెదక్ చుట్టూ..

- ఉమ్మడి జిల్లా వైపు రాష్ట్రం చూపు
- ఎర్రవల్లి ఫాంహౌజ్ కేంద్రంగా బీఆర్‌ఎస్ వ్యూహాలు

- ఈ ప్రాంతంతో పెనవేసుకున్న కాళేశ్వరం రిజర్వాయర్లు
- సీబీఐ విచారణ నేపథ్యంలో నిరసనల వెల్లువ
- హాట్‌టాపిక్‌గా హరీశ్‌రావు అంశం
- తాజా పరిణామాలతో వేడెక్కిన ఉద్యమగడ్డ

ఉమ్మడి మెదక్ జిల్లాలో నెలకొన్న కరువును పారదోలడానికి కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతంలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్లను నిర్మించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ మూడు రిజర్వాయర్లను ప్రారంభించారు. వానాకాలంలో నాలుగేళ్లుగా నీటిని ఎత్తిపోస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్, నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావు సిద్దిపేట జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించారు. పీసీ ఘోష్ కమిషన్ ముందు కూడా ఇద్దరూ హాజరయ్యారు. ఈ కేసును సీబీఐకి అప్పగిస్తామని తాజాగా అసెంబ్లీలో సీఎం ప్రకటించారు. దీనిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. 'ఇది కదా కాళేశ్వరం.. ఇదే కదా కాళేశ్వరం' అంటూ భారీ బ్యానర్లతో రిజర్వాయర్లపై వినూత్నంగా కార్యక్రమాలు చేపట్టారు.

### ఫాంహౌస్ కేంద్రంగా..

కాళేశ్వరంపై విచారణ ప్రారంభమైనప్పటి నుంచి కేసీఆర్ ఆధ్వర్యంలో తన ఫాంహౌస్‌లో పలుమార్లు భేటీ అయ్యారు. ఈ ఫాంహౌస్ కూడా సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం

మిగతా 6వ పేజీలో

### వైద్య ఆరోగ్య శాఖలో

## త్వరలో 8వేల ఉద్యోగాల భర్తీ

### జిల్లాల్లో ట్రామా కేర్ సెంటర్లు, మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాల ఏర్పాటు

### ప్రజారోగ్యానికి తొలి ప్రాధాన్యం : మంత్రి దామోదర్ రాజనర్సింహ



నారాయణఖేడ్‌లో అర్బన్ పార్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, పక్కన ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సబ్ కలెక్టర్ ఉమాహారతి

నారాయణఖేడ్/కల్హేర్/మనూరు, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం నారాయణఖేడ్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి రూ.12.86 కోట్లతో చేపట్టిన వివిధ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య ఆరోగ్య శాఖలో ఇప్పటికే 9వేల పోస్టులను భర్తీ చేసిందని, త్వరలో మరో 8వేల పోస్టుల నియామకాలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. హైవేలపై రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు తక్షణ వైద్యం అందించడానికి అనువుగా ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రతీ జిల్లాలో ఒక డే-కేర్ క్యాన్సర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని తెలియజేశారు. మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పరీక్షలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.

### అభివృద్ధి పనులు ఇవే

నారాయణఖేడ్‌లో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రూర్బన్ పథకం కింద నిర్మించిన కన్వెన్షన్ హాల్ వద్ద డైనింగ్ హాల్, కిచెన్ షెడ్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అర్బన్ పార్కు అభివృద్ధి పనులను, నారాయణఖేడ్ పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు పనులను కూడా ప్రారంభించారు. మనూరు మండలంలో రూ. 6 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం, సిర్గాపూర్‌లో నూతన పీహెచ్‌సీ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కార్యక్రమాల్లో ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సబ్ కలెక్టర్ ఉమాహారతి, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అనంతరం, నారాయణఖేడ్‌లో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు.

## గురువులకు పురస్కార ప్రదానం

7లో




సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన పీజీహెచ్‌ఎం సంజీవరావును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ ప్రావీణ్య

## మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులు

- సర్కారు బడుల్లో నాణ్యమైన విద్యనందించాలి
- సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌కు ఉపాధ్యాయులే మార్గ నిర్దేశకులని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని సూచించారు. టెక్నాలజీ ఆధారిత బోధనా పద్ధతులు అవలంబించి విద్యను ఆకర్షణీయంగా, ఆసక్తికరంగా మార్చాలన్నారు. పోటీ ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబడే స్థాయిలో విద్యనందించడమే ప్రధాన లక్ష్యంగా భావించాలన్నారు. క్రమశిక్షణ, నైపుణ్యం, నైతిక విలువలను పెంపొందించాలని అన్నారు. పాఠశాలల్లో వసతల కల్పన, విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు అన్నిరకాల సౌకర్యాలు కల్పిస్తున్నదని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు ప్రధానం చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, డీఈవో వెంకటేశ్వర్లు, టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- భక్తిశ్రద్ధలతో నిమజ్జనాలు
- ఉత్సాహంగా శోభా యాత్రలు
- జనసంద్రమైన మెదక్, జహీరాబాద్
- భారీ బందోబస్తు



మెదక్‌లో గంగమ్మ ఒడికి చేరుతున్న గణనాథుడు



మెదక్‌లో గంగాహారతి

## వినాయకా.. వీడ్కోలిక



మెదక్ పట్టణంలో నిమజ్జనానికి తరలిన గణనాథులు

మెదక్ అర్బన్/జహీరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో శుక్రవారం పలుచోట్ల గణేష్ నిమజ్జనాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది రోజులు పూజలందుకున్న గణనాథుడికి భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. డీజే, బ్యాండ్ మేళాలు, భజన కార్యక్రమాలు, యువత నృత్యాలతో శోభాయాత్రలు ఘనంగా నిర్వహించారు. మండపాల నిర్వాహకులు ప్రత్యేక వస్త్రాధారణతో శోభాయత్రలో ముందుకుసాగారు. వినాయక మండపాల వద్ద లడ్డు వేలంపాట, లక్కీడ్రాలు. మెదక్‌లో కొంటూర్ చెరువులో నిమజ్జనాలు చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేశారు. పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్న కుమార్, పట్టణ సీఐ మహేష్ పర్యవేక్షించారు. జహీరాబాద్‌లో సార్వజనిక్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు సిద్దం ఉజ్వల్‌రెడ్డి, మాజీ ఎంపీ బీబీపాటిల్ తదితరులు శోభయాత్రను తిలకించారు. నారింజ ప్రాజెక్టులో నిమజ్జనాలు చేశారు.





జహీరాబాద్ పట్టణంలో నిమజ్జనం సందడి

## ప్రేమ పేరిట బాలికపై అత్యాచారయత్నం

నారాయణఖేడ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రేమపేరిట బాలికపై వరసకు బంధువైన ఓ యువకుడు అత్యాచార యత్నానికి పాల్పడి రోడ్డు పై వదిలేసి పారిపోయాడు. ఈ ఘటనకు సంబంధించి ఖేడ్ ఎస్సై విద్యాచరణ్ రెడ్డి కథనం ప్రకారం .. న్యాల్‌కల్ మండలానికి చెందిన 16 ఏళ్ల బాలిక, సిర్గాపూర్ మండలానికి చెందిన 19 ఏళ్ల యువకుడు బంధువులు. వినాయక ఉత్సవాలల్లో భాగంగా బాలిక గురువారం నారాయణఖేడ్ మండలం గ్రామంలోని బంధువుల వద్దకు వచ్చింది. యువకుడు కూడా ఆ గ్రామానికి వెళ్లాడు. రాత్రి గ్రామస్థులు, బంధువులంతా వినాయక నిమజ్జన ఉత్సవాల్లో ఉండగా యువకుడు ఆ బాలికను ప్రేమపేరిట మాయమాటలు చెప్పి గ్రామ శివారులోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడి రోడ్డుపై వదిలేసి పారిపోయాడు. శుక్రవారం తెల్లవారు జామున ఆ బాలిక రోదిస్తుండగా గమనించిన స్థానికులు ఆమె బంధువులకు సమాచారం అందించారు. దీంతో ఆమెను ఖేడ్‌లోని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. బాలిక అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అత్యాచారయత్నానికి పాల్పడిన ఆ యువకుడిపై పోక్సో చట్టం కింద కసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.




పంట పొలంలో చేరిన ప్లాస్టిక్ కవర్లు


గుట్టలుగుట్టలు ఉండే డంప్‌యార్డు.. ప్రస్తుతం ఖాళీగా దర్శనమిస్తుందిలా...!

# హమ్మయ్యా.. చెత్త పోయింది..!

● వర్షాలకు కొట్టుకు పోయిన డంపింగ్ యార్డ్‌లోని వ్యర్థాలు

● ఊపిరి పీల్చుకున్న అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షం మున్సిపల్ అధికారులకు ఒకింత మేలు చేసింది. వర్షాలతో ప్రజలంతా ఉక్కిరిబిక్కిరి అవగా.. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ అధికారులు హమ్మయ్యా అనుకున్నారు..! మొన్నటివరకు గుట్టలుగా చెత్త పేరుకు పోగా, వర్షాలకు చెత్తంతా కొట్టుకుపోయింది. దీంతో శానిటేషన్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారట..? గతంలో తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మికంపోస్ట్ తయారు చేసేవారు. ఆ ప్రాజెక్ట్ పూర్తి కావడంతో గుట్టలుగా చెత్త, చెదారం పేరుకుపోయింది. తడి, పొడి వేరు చేయకపోవడం.. ముఖ్యంగా ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు, వ్యర్థాలు ఏ మాత్రం వేరు చేయకపోవడంతో తిరిగి డంపింగ్ యార్డు పూర్తిగా దుర్గంధ భరితంగా మారిపోయింది. ఈ తరుణంలో ఏం చేద్దామనుకుంటున్న అధికారులకు ఈ వర్షం తోడుగా నిలిచింది. మూడు రోజులు భారీగా వర్షం కురవడంతో పై భాగంలో నుండి వచ్చిన వరదకు ఒక్క సారిగా ఇటీవలే నిర్మించిన ప్రహరీ నేలకూలింది. వరద పోటెత్తడంతో పక్కనే ఉన్న శివాయిపల్లి వాగు లోకి పంటపొలాల్లోకి చెత్తంతా కొట్టుకుపోయింది. దీంతో ప్రస్తుతం సగభాగం డంపింగ్‌యార్డు ఖాళీ అయింది. వరద ప్రవాహం తగ్గడంతో అక్కడికి చేరుకున్న అధికారులు హమ్మయ్య.. ప్లాస్టిక్ అంతా కొట్టుకుపోయిందని ఊపిరి పీల్చుకున్నారట.

## ఇటు వృథా.. అటు వ్యధ

● పాతభవనం శిథిలం

● కొత్త భవనం నిరుపయోగం

జిన్నారం, సెప్టెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జిన్నారంలో పీహెచ్‌సీ భవనం స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారగా.. నూతనంగా నిర్మించిన ఆరోగ్య భవనం ప్రారంభానికి నోచుకోవటం లేదు. జిన్నారంలో ప్రస్తుతం వినియోగిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకుని స్లాబు పెచ్చులు ఊడిపడుతుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాల దాటికి అన్ని గదుల్లో పెచ్చులు ఊడటంతో వర్షపు నీరు గదులు, ఫ్లోరింగ్ వరకు చేరగా ఇక్కట్ల మధ్యే సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరటంతో ఏడాది క్రితం 1.50 కోట్లతో ఆరోగ్య భవనాన్ని నిర్మించగా ప్రారంభోత్సవానికి నోచుకోవటం లేదు. కొన్ని పనుల కోసం మరో రూ.15 లక్షల వరకు నిధులు అవసరం ఉండగా నిధులు రాక భవనం నిరుపయోగంగా మారింది.


ఏడాదిగా ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య భవనం

దీంతో పాత భవనంతో అవస్థలు. నూతన భవనం నిరుపయోగంగా మారాయి. వెంటనే అధికారులు, నాయకులు స్పందించి నూతనంగా నిర్మించిన ఆరోగ్య భవనాన్ని ప్రారంభించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.

## ఫోన్ హ్యాక్ చేసి రూ.2.8లక్షలు డ్రా

పటాన్‌చెరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫోన్ హ్యాక్ చేసి మూడు బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు డ్రా అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిదిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణం గోకుల్‌నగర్‌లో నివాసం ఉంటున్న మహేందర్‌శర్మ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఎస్‌బీఐ, యాక్సిస్, యూనియన్ బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయి. గత నెల ఒకటవ తేదీ రాత్రి యూనియన్‌బ్యాంకు నుంచి రూ.30వేలు, యాక్సిస్ బ్యాంకు ఖాతా నుంచి రూ.80వేలు, ఎస్‌బీఐ నుంచి రూ. 98వేలు చొప్పున డెబిట్ అయినట్లు ఎస్‌ఎంఎస్‌లు వచ్చాయి. అలా రూ.2.8 లక్షలు సైబర్ మోసం జరిగిందంటూ మహేందర్‌శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## తల్లీ, ఇద్దరు బిడ్డలు అదృశ్యం


శిరీష(ఫైల్)


హారిక, ఆద్య(ఫైల్)

తూప్రాన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భర్తతో చిన్నపాటి గొడవ జరిగింది. భర్త వ్యవసాయ పనులకు వెళ్లగా భార్య ఇద్దరు చిన్నారులతో కలిసి కనిపించకుండా పోయింది. ఈ సంఘటన శుక్రవారం తూప్రాన్ మండలం మల్కాపూర్‌లో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్సై శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన చింతల మహేందర్ (34)కు సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం అప్పాయిపల్లికి చెందిన శిరీష (26)తో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి హారిక (8), ఆధ్య (5) సంతానం . ఆర్థిక ఇబ్బందులతో వివాహమైన కొద్దిరోజులకే బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లారు. మహేందర్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో రెండు నెలల క్రితం మల్కాపూర్ స్వగ్రామానికి వచ్చేశారు. గురువారం హైదరాబాద్‌లో పనిమీద మహేందర్ వెళ్లేందుకు సిద్దంకాగా, శిరీష కూడా వస్తానంటు చెప్పడంతో చిన్నపాటి గొడవ జరిగింది. హైదరాబాద్‌కు మహేందర్ ఒక్కడే వెళ్లి తిరిగి సాయంత్రానికి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయమే వ్యవసాయ పనులకు తల్లిదండ్రులతో కలిసి వెళ్లాడు. 9గంటలకు ఇంటికి రాగా, ఇంటికి తాళం వేసి ఉంది. ఇంటి వద్ద ఉన్న భార్య, కూతుర్లు కనిపించలేదు. ముగ్గురి కోసం చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకి లభించలేదు. దీంతో పోలీసులకి ఫిర్యాదు చేశాడు. మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివానందం వివరించారు.

## 60 గ్రాముల గంజాయి స్వాధీనం

నర్సాపూర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులో తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద 60గ్రాముల ఎండుగంజాయి లభించినట్లు ఎస్సై లింగం తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణంలో ఇద్దరు అనుమానస్పదంగా తిరుగుతూ గంజాయి అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారంతో వారిని అదుపులో తీసుకుని విచారించగా మెదక్ పట్టణానికి చెందిన కుక్కలశివకుమార్, చింతకుంట ప్రేమ్‌కుమార్‌లుగా తెలిపారు. వారి వద్ద తనిఖీ చేయగా 60గ్రాముల గంజాయి లభించగా వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింగం తెలిపారు.

## బీహెచ్‌ఈఎల్ కార్మిక నేత జి.ఎల్లయ్య కన్నుమూత

● 9 సార్లు భెల్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా సేవలు

● తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న నేత

అమీన్‌పూర్/రామాయంపేట్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ కార్మిక నాయకుడు జి.ఎల్లయ్య శుక్రవారం తెల్లవారు జామున గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన వయస్సు 86సంవత్సరాలు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో ఆయన విశ్రాంత జీవితం గడుపుతున్నారు. ఆయన స్వగ్రామం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట. బీహెచ్‌ఈఎల్ అధికారిక కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ తరఫున ఆయన 9సార్లు విజయం సాధించి అధ్యక్షుడిగా సేవలు అందించారు. ముందునుంచి తెలంగాణ వాది అయిన ఎల్లయ్య భెల్ ఉద్యోగ నియామకాల్లో తెలంగాణ యువతకు న్యాయం జరిగేలా అనేక పోరాటాలు చేశారు. వేలాది మంది భెల్ ఉద్యోగులకు సొంత ఇళ్లను సమకూర్చడంలో ఆయన యాజమాన్యం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి కాలనీలను ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారని విశ్రాంత భెల్ ఉద్యోగులు గుర్తు చేసుకున్నారు.


జి.ఎల్లయ్య (ఫైల్)

మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ట్రేడ్‌యూనియన్ కురువృద్ధుడిగా భావించే ఎల్లయ్య మృతి కార్మికలోకానికి తీరని లోటని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్‌రెడ్డి ఎల్లయ్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదర్శరెడ్డి, చిన్నపరిశ్రమల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్‌రావు, టీఎన్‌టీయూసీ నాయకులు సత్తయ్య, ఐఎన్‌టీయూసీ భెల్ సీనియర్ నాయకులు రెహమాన్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, కార్మిక సంఘాల నాయకులు నివాళులు అర్పించారు.

### కేటీఆర్, హరీశ్ సంతాపం

బీహెచ్‌ఈఎల్ కార్మికుల్లో చెరిగిపోని ముద్రవేసుకున్న కార్మికనేత ఎల్లయ్య మరణంపట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శుక్రవారం సంతాపం తెలిపారు. సాధారణ కార్మికుడిగా ప్రారంభమై.. జీవితమంతా శ్రమజీవుల హక్కులకోసం పోరాడి, వారి గొంతుకగా నిలిచిన ఎల్లయ్య అందరికీ ఆదర్శమన్నారు. వారిని కోల్పోవడం కార్మిక లోకానికి తీరనిలోటు అని, భగవంతుడు ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని వారు ప్రార్థించారు.

## వాహనం ఢీకొని దినసరి కూలీ మృతి

శివ్వంపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం పెద్దగొట్టిముక్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. మండల పరిధిలో పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన గంగన్న గారి నాగరాజు కొంత కాలంగా కుటుంబ సభ్యులతో గోమారం గ్రామంలో అద్దెకు ఉంటున్నాడు. తను కూలి పని చేసుకుంటూ భార్య భాగ్యలక్ష్మి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. నాగరాజు (35) గురువారం కూలి పనికి వెళ్లాడు. పనికి వెళ్లిన నాగరాజు రాత్రి 7 గంటలు అవుతున్న ఇంటికి రాలేదు. భార్య భాగ్యలక్ష్మి నాగరాజుకి ఫోన్ చేసింది. గ్రామ శివారులోని మాలకుంట వాగు బ్రిడ్జ్ దగ్గర నుంచి నడుచుకుంటూ వస్తున్నానని చెప్పాడు. గోమారానికి చెందిన వంశీ వచ్చి రోడ్డు ప్రమాదం జరిగిందని చెప్పడంతో భార్య భాగ్యలక్ష్మి తన అన్న నాగరాజు వెళ్లి చూడగా తలకు, కన్నుకు బలమైన గాయం కావడంతో నాగరాజుని నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా శతగాత్రుడిని పరిశీలించిన సంగారెడ్డి వైద్యులు మృతి చెందాడని తెలిపారు. భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

## నిమజ్జనానికి వెళ్లి నీట మునిగి యువకుడి మృతి

హవేళీఘణపూర్, సెప్టెంబరు 5,(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి వెళ్లి నీళ్లల్లో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. తొగిట గ్రామానికి చెందిన మొండి ప్రభాకర్ - సుజాత దంపతుల కుమారుడు మొండి సుధాకర్(19)మెదక్ జిల్లాకు చెందిన వాడు. డిగ్రీ చదువుతున్నాడు. వినాయక నిమజ్జన ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో నిర్వహించిన ఊరేగింపులో పాల్గొన్నాడు. గ్రామ శివారులోని రామస్వామి చెరువులో వినాయకుడిని వేయడానికి వెళ్లిన సుధాకర్‌కి మూర్ఛ రావడంతో నీటిలో మునిగాడు. మండల సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా వారు చెరువులో వెతకగా సుధాకర్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## గురుకులాల్లో మెరుగైన విద్యా ప్రమాణాలు

రామాయంపేట ,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా అంతటా ఉన్నత ప్రమాణాలే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. రామాయంపేటలోని కస్తూర్బా విద్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. బాలికల తరగతి గదిలోకి వెళ్లిన ఆయన.. 10 నిమిషాల పాటు క్లాస్ తీసుకున్నారు. పిల్లల విద్యాభ్యాసం.. బోధన ప్రక్రియపై ఆరా తీశారు. అనంతరం వంటశాల, వసతుల సౌకర్యాలను చూశారు. పిదప గురుపూజోత్సవ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. చివరగా కలెక్టర్ రామాయంపేట సర్వయ్య కుంట వద్దకు వెళ్లి వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.


రామాయంపేట కస్తూర్బా బాలికలకు క్లాస్ తీసుకుంటున్న రాహుల్ రాజ్

## చనిపోతున్నానని ఫోన్..

● 100కి కాల్ చేసి కాపాడుకున్న కొడుకు

మద్దూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యల నేపథ్యంలో ఓ తండ్రి తను చనిపోతున్నాడని ఫోన్ చేసి చెప్పి స్విచ్ ఆఫ్ చేశాడు. ఆందోళన చెందిన కుమారుడు 100 కి డయల్ చేసి పోలీసుల సహాయంతో తండ్రిని కాపాడుకున్న సంఘటన మద్దూరు మండలం రేబర్తిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపిన వివరాలు.. రేబర్తి గ్రామానికి చెందిన ఎర్రబచ్చల రాజు తన కుమారుడైన శ్రీకాంత్‌కు ఫోన్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పి ఫోన్ స్విచ్ ఆఫ్ పెట్టాడు. కుమారుడు శ్రీకాంత్ 100కి డయల్ చేశాడు. అప్రమత్తమైన బ్లూకోర్ట్ సిబ్బంది నాగరాజు, బాబు ఎర్రబచ్చల రాజు ఫోన్ నెంబరు తెలుసుకుని ఐటీ కోర్ సిద్దిపేట సిబ్బంది సహాయంతో లొకేషన్ తీసుకున్నారు.కూటిగల్ అటవీ ప్రాంతంలో ఉన్నట్లు తెలుసుకుని వెతికి ప్రాణాలతో పట్టుకున్నారు. వెంటనే రాజును కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## డీడీఎస్-కేవీకేకు పురస్కారాలు


శాస్త్రవేత్త డా..వరప్రసాద్‌కు పురస్కారాలు అందజేస్తున్న అధికారులు

జహీరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని అల్గోల్-దిడిగి శివారులోగల డీడీఎస్-కేవీకే వివిధ అంశాల్లో ప్రతిభను కనబరిచిన నేపథ్యంలో అటారీజోన్ వారు గురువారం పురస్కారాలు అందజేశారు. అటారీజోన్10వ వార్షికోత్సవ మహాసభలను తమిళనాడులోని వేలురులో ఈ నెల 2నుంచి 4వరకు నిర్వహించారు. డీడీఎస్-కేవీకేకు పురస్కారాలు రావడం అందరికి సంతోషంగా ఉందని, మరింత బాధ్యతను పెంచుతున్నటుగా ఉన్నాయన్నారు.

## మట్టి టిప్పర్‌ను సీజ్ చేసిన ఎస్సై

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోహీర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్‌ను కోహీర్ ఎస్సై నరేష్ శుక్రవారం సాయంత్రం పట్టుకుని సీజ్ చేశారు. అక్రమ మట్టి రవాణాపై ఎర్ర మట్టి కొల్ల గొట్టి అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మట్టి ఆ ప్రాంతాలను పరిశీలించారు. కోహీర్ మండలంలోని చింతలఘట్టు గ్రామ శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్‌ను పట్టుకుని సీజ్ చేశారు.

## ఇద్దరి పిల్లల గొంతునులిమి చంపి, తల్లి ఆత్మహత్య


ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్య చేసుకున్న ప్రేమల

నారాయణఖేడ్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం నిజాంపేట గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నిజాంపేట గ్రామానికి చెందిన ప్రేమల (22)ను దామరచెరువు గ్రామానికి చెందిన సంగమేశ్వర్‌కు ఇచ్చి, మూడున్నరేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ధనుష్ (2) సూర్యవంశీ (45 రోజులు) సంతానం. ఇటీవల తల్లిగారి ఊరైన నిజాంపేటలో సూర్యవంశీ డోలారోహణం (తొట్టెల) నిర్వహించారు. తర్వాత దామరచెరువుకు వెళ్లిన ప్రేమల రెండు రోజుల క్రితం నిజాంపేటకు వచ్చింది. ఏం జరిగిందో ఏమో కానీ, శుక్రవారం ఇంట్లో ఇద్దరు పిల్లలను గొంతు నులిమి హతమార్చి తాను ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ కలహాలతోనే ఆమె ఘాతుకానికి పాల్పడినట్లు భావిస్తున్నారు.

# మెదక్ చుట్టూ..

(5వ పేజీ తరువాయి)

ఎర్రవల్లిలోనే ఉంది. కాళేశ్వరంపై కేసీఆర్, హరీశ్‌రావులు సుదీర్ఘంగా చర్చలు చేసి నివేదికలు రూపొందించారు. విచారణకు హాజరైన సందర్భంలోనూ ఇక్కడి నుంచే బయల్దేరారు. ఈ-కార్ రేస్ కేసు అంశంలోనూ కేటీఆర్‌తో కేసీఆర్ చర్చించారు. పార్టీ పరిస్థితి గురించి తాను రాసిన లేఖను లీక్ చేశారని తొలిసారి కవిత ఆరోపించిన సందర్భంలోనూ కీలక నేతలతో ఇదేచోట కేసీఆర్ భేటీ అయ్యారు.

ఆ తర్వాత రెండు మార్లు కవిత ఫాంహౌస్‌కు వచ్చిన సందర్భాలనూ రాష్ట్ర ప్రజలు తీక్షణంగా పరిశీలించారు.

ఇటీవల కవిత ఆరోపణలను తీవ్రంగా పరిగణించి ఇక్కడే నిర్ణయం తీసుకుని ఆమెను సస్పెండ్ చేశారు. కవిత ప్రణాళిక, కాళేశ్వరంపై ప్రభుత్వ నిర్ణయాలతో పాటు స్థానిక ఎన్నికలపై నిత్యం ఫాంహౌస్‌లో చర్చిస్తున్నట్లుగా తెలుస్తోంది. నాడు ఉద్యమ సమయంలో, ఆ తర్వాత అధికారంలోనూ కేసీఆర్ ఇక్కడి నుంచే సంచలనాలకు శ్రీకారం చుట్టారు. అందుకే తాజా పరిణామాలకూ ఫాంహౌస్ కేంద్రబిందువుగా మారింది.

### హరీశ్.. హాట్‌టాపిక్

వరుసగా ఆరుసార్లు సిద్దిపేట ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రిగా, బీఆర్‌ఎస్ పార్టీలో కీలకనేతగా ఉన్న హరీశ్‌రావుపై కవిత చేసిన ఆరోపణలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. ఈ ప్రాంతంలో బలమైన నాయకుడిగా పేరున్న హరీశ్‌రావుపై ఆరోపణలు చేయడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు, ఆయన అభిమానులు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఆమె దిష్టిబొమ్మలను దహనం చేయడంతోపాటు సోషల్‌మీడియా వేదికగా విమర్శలు గుప్పిస్తున్నారు. హరీశ్‌రావు వంటి వ్యక్తిని విమర్శించినందుకు పార్టీ సరైన నిర్ణయం తీసుకుందని పేర్కొంటున్నారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసిన పద్మాదేవేందర్‌రెడ్డితోపాటు కేసీఆర్‌కు, కవితకు సన్నిహితంగా మెలిగిన వాళ్లు కూడా ఆమె మాటలను తప్పుబడుతున్నారు. ప్రస్తుతం హరీశ్‌రావు లండన్‌లో ఉన్నందున ఆయన రాకకోసం ఎదురుచూస్తున్నారు.



అవార్డు అందుకుంటున్న సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని మజీద్‌పల్లి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు బద్దిపడగ రమేశ్



అవార్డు అందుకుంటున్న సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయురాలు వాకిటి శ్రీదేవి



అవార్డు అందుకుంటున్న సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి హెచ్ఎం విద్యాసాగర్

# గురువులకు పురస్కార ప్రదానం

సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ శిల్పకళా వేదికపై రాష్ట్ర ప్రభుత్వం గురుపూజోత్సవం 2025 కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నికోలస్, ఉన్నత విద్యా కార్యదర్శి దేవసేన అవార్డులను అందజేశారు.

- వర్గల్/సంగారెడ్డి అర్బన్/పాపన్నపేట



అవార్డు స్వీకరిస్తున్న మెదక్ జిల్లా పాపన్నపేట మండలం గాజులగూడెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాయిసిరి



అవార్డు అందుకుంటున్న సంగారెడ్డి తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు సదయకుమార్



## ప్రీ ప్రైమరీ స్కూల్స్ స్టాల్ చాలా బాగుంది

### స్టాల్ రూపకల్పన చేసిన అంగడికిష్టాపూర్ ఉపాధ్యాయులకు సీఎం ప్రశంస

మర్కుక్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గురు పూజోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పారామం ఆడిటోరియంలో శుక్రవారం ఉత్తమ గురువులకు పురస్కారాల ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పరిశీలించారు. ఐదో నంబర్‌లోని ప్రీ ప్రైమరీ స్కూల్స్ స్టాల్ ఏర్పాటులో అంగడికిష్టాపూర్ ఉపాధ్యాయులు పాలుపంచుకున్నారు. ఈ స్టాల్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చాలా బాగుందని అభినందించారు.

## గీతంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



కళాకృతి బృందం చేస్తున్న శాస్త్రీయ నృత్యం

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువత భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులు, మార్గదర్శకుల సేవలను గుర్తించి, గౌరవిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించింది. దేశ రెండో రాష్ట్రపతి, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులు అర్పించారు. ఈ వేడుకలో భాగంగా, గీతంలో అత్యుత్తమ సేవలందించిన ఉపాధ్యాయులు, సహాయక సిబ్బందిని సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడికి రూ.60 వేలు, ఉత్తమ సహాయక సిబ్బంది (ఇన్‌హౌస్, అవుట్‌సోర్స్) ఒక్కొక్కరికి రూ.40 వేల చొప్పున నగదు పురస్కారాలు అందించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్కూల్ ఆఫ్ సైన్స్‌లో గణిత విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ విజయశేఖర్ జాలిపర్తి, ఉత్తమ సహాయక సిబ్బంది అవార్డులను స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగం సీనియర్ ఎగ్జిక్యూటివ్ కె. సత్యనారాయణ, ఆతిథ్య విభాగం సూపర్‌వైజర్ అమర్జిత్‌కుమార్ అందుకున్నారు. గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్.రావు అవార్డులను అందజేసి, విజేతల అంకితభావం, నిబద్ధతను ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాకృతి బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు, జుగల్‌బందీ, లలిత సంగీతం అందరినీ ఆకట్టుకున్నాయి.

## యూరియా వెతలు.. రైతుల బాధలు



మిరుదొడ్డిలో రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

మిరుదొడ్డి/చేగుంట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యూరియా వెతలు తీరడం లేదు. శుక్రవారం మిరుదొడ్డి, చేగుంట మండలాల్లో రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. మిరుదొడ్డి రైతువేదిక వద్దకు శుక్రవారం భారీ సంఖ్యలో చేరుకున్న రైతులకు ఎంతసేపటికి యూరియా టోకెన్లు పంపిణీ చేయలేదు. యూరియా లోడ్ రాలేదని తెలుసుకుని ఆగ్రహించిన రైతులు గజ్వేల్ - మిరుదొడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకోను నిర్వహించారు. ఎస్ఐ సమతా సిబ్బందితో అక్కడికి చేరుకుని రైతులను సముదాయించారు. అయిన వినకపోవడంతో గంట పాటు వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. అధికారులతో మాట్లాడి యూరియా కొరత లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకోను విరమించారు. చేగుంట మండల పరిధిలోని ఇబ్రహీంపూర్ సొసైటీకి 450 బస్తాలు, చేగుంట ఆగ్రో సేవా కేంద్రానికి 450 బస్తాలు వచ్చాయి. చేగుంటలో లైన్‌లో వేచి ఉండి, టోకెన్ ఉన్న రైతులకు ఒక్కొక్కరికి ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు. ఇబ్రహీంపూర్ సొసైటీ కార్యాలయం వద్ద కొంతమంది రైతులకు యూరియా అందకపోవడంతో ఆందోళనకు దిగారు.

## కేతకీలో రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి పూజలు

ఝరాసంగం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధిగాంచిన శ్రీకేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాష్ట్ర హైకోర్టు సిట్టింగ్ జడ్జి డాక్టర్ లతాబస్వరాజ్ పాట్నే కుటుంబసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదామంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మొదట అమృతగుండంలో పూజలు చేశారు. అనంతరం ఆలయ గర్భగుడిలోని స్వామి వారికి అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ అధికారులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హనుమంతురావుపాటిల్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ఈవో శివరుద్రప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఝరాసంగంలో పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు, నాచగిరిలో పూజలు చేస్తున్న గాడిపల్లి ప్రవీణ్

## నాచగిరి క్షేత్రంలో హైకోర్టు అదనపు న్యాయమూర్తి

వర్గల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని శుక్రవారం హైకోర్టు అదనపు న్యాయమూర్తి గాడిపల్లి ప్రవీణ్ కుమార్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంగళవాయిద్యాలు, మేళ తాళాలతో న్యాయమూర్తికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి శేష వస్త్రాలతో పాటు తీర్థ ప్రసాదాలు అందజేసి, ఆశీర్వచనాలు అందజేశారు.

దేశంలోని అత్యుత్తమ ఇంజనీరింగ్ విద్యాసంస్థల జాబితాలో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ నిలిచింది. కేంద్ర మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్స్ ఫ్రేమ్ వర్క్స్)-2025 ర్యాంకిగ్స్‌లో ఏడో స్థానంలో నిలిచి సత్తా చాటింది. అంతేగాక ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో 12 స్థానం దక్కించుకున్నది.



# ఐఐటీహెచ్..మరో మైలురాయి

### అత్యుత్తమ విద్యాసంస్థల జాబితాలో చోటు

### ఎన్ఐఆర్ఎఫ్–2025 ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానం

### ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో 12 స్థానం కైవసం



పరిశోధన పరికరాల డిజైన్లను పరిశీలిస్తున్న ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కె.సంజయ్‌మూర్తి

కంది, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఐఆర్ఎఫ్ ఇంజనీరింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా ఐఐటీహెచ్ ఏడో స్థానం, ఇన్నోవేషన్‌లో ఆరో స్థానం, పరిశోధనల్లో 15వ స్థానం, ఓవరాల్‌గా 12వ స్థానంలో ఐఐటీ-హెచ్ ర్యాంకులు సాధించడం గర్వకారణమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. గతేడాది ఇదే ర్యాంకిగ్‌లో 8వ స్థానంలో ఉండగా ఈసారి గువాహటి ఐఐటీని అధిగమించి హైదరాబాద్ ఐఐటీ ముందంజలో నిలిచింది.

**పరిశోధనలు, ప్రాజెక్ట్‌లను బలపరుస్తాం**



ఐఐటీహెచ్‌ను ప్రపంచస్థాయి పరిశోధనల ప్రాజెక్టులలో బలమైన శక్తిగా మారుస్తాం. 330పైగా ఫ్యాకల్టీ, 5,750 విద్యార్థులతో ఐఐటీహెచ్ 5040 ప్రాజెక్టులతో బలమైన పరిశోధన దృష్టిని కలిగి ఉంది. రూ.1600 కోట్ల పరిశోధనాభివృద్ధి నిధులు, 580 పేటెంట్లు, దాదాపు 320 స్టార్టప్‌లు రూ.1500 కోట్ల ఆదాయంతో 1100 ఉద్యోగాలను సృష్టించాయి. ఐఐటీ హైదరాబాద్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఏడోస్థానంలో నిలిచి ఈ సంవత్సరం ఒక మైలురాయిని సాధించింది.

- బీఎస్ మూర్తి, ఐఐటీహెచ్ డైరెక్టర్

**పదిహేడళ్లల్లో ఉత్తమంగా..**

2008లో స్థాపించబడిన ఐఐటీహెచ్, 17 సంవత్సరాల స్వల్ప వ్యవధిలో విద్య, పరిశోధన, సాంకేతికత, అభివృద్ధి, స్టార్టప్‌లలో గౌరవనీయమైన స్థానానికి చేరుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్స్ (ఎన్ఐఆర్ఎఫ్)లో, ఐఐటీ-హెచ్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఏడో స్థానానికి చేరుకుంది. అంతేగాక ఇన్నోవేషన్‌లో ఆరో స్థానంలో ఉన్నది. అయితే ఎన్ఐఆర్ఎఫ్ ప్రారంభించినప్పటి నుంచి ఐఐటీహెచ్ టాప్ 10 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో తన ర్యాంక్‌ను నిలుపుకుంటుంది. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్ 2025-26 విద్యాసంవత్సరంలో 664వ స్థానంలో ఉంది. భారతదేశంలోని టాప్ 10 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఒకటిగా నిలిచింది. ఐఐటీహెచ్ 'మానవత్వం కోసం టెక్నాలజీని కనిపెట్టడం, ఆవిష్కరణలు' అనే నినాదంతో శ్రేష్ఠత కోసం కృషి చేస్తోంది.

## అమీన్‌పూర్‌లోనే నవోదయ

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



కేంద్ర నవోదయ విద్యాసమితి డిప్యూటీ కమిషనర్‌తో ఎంపీ రఘునందన్‌రావు

అమీన్‌పూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకు మంజూరైన జవహర్ నవోదయ విద్యాయలంను పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్‌లో ఏర్పాటు చేయడానికి కేంద్రం అంగీకరించిందని మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కేంద్ర నవోదయ విద్యాలయ సమితి డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బేరా ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే తాత్కాలికంగా ఒక ప్రైవేటు భవనంలో తరగతులు ప్రారంభిస్తారని ఎంపీ వెల్లడించారు. ఈ పాఠశాల నిర్మాణానికి సుమారు రూ.1,500 కోట్లు కేటాయించారని, ప్రతి ఏటా రూ.500 కోట్ల చొప్పున నిధులు విడుదల చేస్తూ మూడేళ్లలో పూర్తి చేస్తారని ఎంపీ తెలిపారు. 1986లో పీవీ నరసింహారావు మానవ వనరుల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు నవోదయ విద్యాలయాలకు శ్రీకారం చుట్టారని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో వర్గల్‌లో జవహర్ నవోదయ పాఠశాల ఉందని, ఆ పాఠశాలలో చదివిన అనేకమంది విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారని పేర్కొన్నారు. గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్‌స్థాయి విద్యను అందించడంలో నవోదయ విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. పాఠశాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి నవోదయ సమితి ఉన్నత స్థాయి అధికారులు అమీన్‌పూర్ రానున్నారని ఎంపీ వెల్లడించారు. అమీన్‌పూర్ పరిధిలోని 993 సర్వే నంబర్‌లో సుమారు 30 ఎకరాల స్థలం అనుకూలంగా ఉంటుందని అధికారులు గుర్తించారని, ఢిల్లీ నుంచి వచ్చే బృందం ఈ స్థలాన్ని పరిశీలించనున్నట్లు ఎంపీ వివరించారు.

## ముఖ్యమంత్రిది మోసం.. ప్రతిపక్ష నేత గడీలో బందీ

- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ



దుబ్బాక, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లను పెంచుతామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి దారుణంగా మోసం చేస్తుంటే.. ప్రతిపక్ష నాయకుడు మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రాకుండా గడీలో బందీ అయ్యాడని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ విమర్శించారు. దుబ్బాకలో ముక్కపల్లి కనకరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ పింఛన్‌దారుల సన్నాహక సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టి 20 నెలలు గడుస్తున్నా రూపాయి పింఛన్ పెంచలేదన్నారు. అధికార పక్షంను నిలదీయాల్సిన ప్రతిపక్షం అసమర్థంగా తయారైందని మండిపడ్డారు. దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలని, ఇతర పింఛన్లన్నీ రూ.4 వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిలిద్దరూ ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు అనుచరులేనని, వారిద్దరూ ఆయనను చూసి నేర్చుకోవాలన్నారు. పింఛన్ పెరిగేంత వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించే చేయూత పింఛన్‌దారుల మహాగర్జనకు ప్రతీ గ్రామం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ మెదక్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ దండు శంకర్, ఎమ్మార్పీఎస్ సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్, వీహెచ్‌పీఎస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ముక్కపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# లంబోధర లడ్డూలు

### వేలంలో రికార్డులు.. భక్తుల పోటాపోటీ

రామచంద్రాపురం టౌన్/రామచంద్రాపురం/సంగారెడ్డి రూరల్/హవేళిఘణపూర్/పెద్దశంకరంపేట/చేర్యాల/హుస్నాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల చెంత ఉంచిన లడ్డూలను వేలం పాట నిర్వహించగా లక్షల్లో ధర పలికాయి. ఆసక్తి గల భక్తులు పోటాపోటీగా పాడుతూ భారీ ధరను వెచ్చించి దక్కించుకున్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం డివిజన్ పరిధి మల్లికార్జున్‌నగర్ కాలనీలోని రుద్రసేన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మూడు లడ్డూలు వేలం వేశారు. వీటిని మల్లీశ్వరరావు, రిషి, దుర్గ రూ.6.90 లక్షల భారీ మొత్తానికి దక్కించుకుని రికార్డు సృష్టించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌నగర్‌లో బాలగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన లడ్డూ వేలం పాటలో కుమ్మరి వీరయ్య రూ.2.84 లక్షలకు దక్కించుకున్నారు. మహాదేవ్ ఉత్సవ కమిటీ లడ్డూను పర్వ ఈశ్వర్ రూ.2.65 లక్షలకు, రెండో లడ్డూను రూ.1.5లక్షలకు గాండ్ల శ్రీనివాస్ దక్కించుకున్నారు. ఈదుల నాగులపల్లిలోని లిటిల్ స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో ఎన్.వెంకటేశంగౌడ్ రూ.2.45 లక్షలకు లడ్డూను తీసుకున్నారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని పల్లవా రెసిడెన్సిలోని వినాయక లడ్డూను పద్మశాలి సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు నక్క రాఘవులు రూ.2.20 లక్షలకు పాట పాడారు. మెదక్ జిల్లా హవేళిఘణపూర్‌లో శివ గణేష్ మండలి వారి లడ్డు రూ.1,46,500 బత్తుల మహేష్ సొంతం చేసుకున్నాడు. పెద్దశంకరంపేట మండలం మాధవనగర్‌కాలనీలో ప్రతిష్ఠించిన వినాయక మండపం వద్ద గణేష్ లడ్డును వేలం పాట వేయగా మేడ్చల్‌కు చెందిన గజం సాయికిరణ్ రూ.1,36,666కు తీసుకున్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలోని స్థానిక వైశ్యభవన్‌లోని వినాయకుడి చెంతన పూజలందుకున్న లడ్డూ ప్రసాదానికి వేలంపాట నిర్వహించగా వంగపల్లి వెంకటేశం రూ.46,116కు పాడి దక్కించుకున్నాడు. హుస్నాబాద్‌లోని ఆఫీస్ రోడ్డు గజానన మండలి లడ్డు రూ.63,333కు, గోదాంగడ్డ గణపతి లడ్డు రూ.57 వేలు, జ్యోతినగర్ వినాయక లడ్డు రూ.41 వేలకు భక్తులు సొంతం చేసుకున్నారు.



పైడిగుమ్మల్‌లో వినాయకుడి లడ్డుతో ముస్లిం

### లడ్డు కైవసం చేసుకున్న ముస్లింలు

కోహీర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భక్తులు వినాయకుడి లడ్డును దక్కించుకునేందుకు ఉత్సాహంగా పాల్గొంటారు. కానీ, కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్, పోతిరెడ్డిపల్లి గ్రామంలో లడ్డు వేలం పాటలో ముస్లింలు పాల్గొనడమే కాదు, లడ్డూను కైవసం చేసుకున్నారు. పైడిగుమ్మల్‌లో ముస్లిం రూ.1.56 లక్షలకు పోతిరెడ్డిపల్లిలో మరో ముస్లిం రూ.37 వేలకు దక్కించుకుని తమ భక్తిని చాటుచున్నారు.

## 21 నెలల్లోనే రూ.2.20 లక్షల కోట్ల అప్పు

- రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయం
- యూరియా సంక్షోభం వెనుక కుట్ర
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గజ్వేల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోనే నంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు అప్పగించామని, కానీ 21 నెలల్లోనే రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం కేవలం రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 21 నెలల్లోనే 2.20 లక్షల అప్పు చేసిందని, ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదన్నారు మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌజ్‌లో కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలన చేతకాని కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనపై దృష్టి పెట్టకుండా కేసీఆర్ పేరును పదేపదే ప్రస్తావిస్తున్నారని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. యూరియా సంక్షోభం వెనుక రాష్ట్ర ప్రభుత్వం కుట్ర ఉందని, ప్రభుత్వం యూరియా పట్ల అనుసరిస్తున్న విధానంలో అనుమానాలు వస్తున్నాయన్నారు. పంటల బోనస్‌కు ఎగ్గొంట్టేందుకు కావాలని యూరియాను ప్రభుత్వం సరఫరా చేయడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, త్వరలో రాష్ట్రంలో ఉప ఎన్నికలు రావడం ఖాయమన్నారు. సుప్రీంకోర్టు స్పీకర్‌కు స్పష్టమైన ఆదేశాలను ఇచ్చిందన్నారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోని పక్షంలో మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని, న్యాయపోరాటం కొనసాగిస్తామని తెలిపారు. బాన్సువాడలో ఉప ఎన్నికలో పోచారం భారీ ఓటమి చవిస్తారన్నారు. రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## బీరంగూడలో అశ్వాలపై భారీ గణనాథుడు

అమీన్‌పూర్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 25 ఏళ్లుగా బీరంగూడలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న వినాయక నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. ప్రతీ ఏటా ఏదో ఒక ప్రత్యేకత ఉండేలా నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి వినాయకుడు మూడు రంగుల్లో ఉన్న అశ్వాలతో పరిగెత్తుతున్న రథంపై ఆసీనుడైనట్లు 35 అడుగుల ఎత్తుతో ఆకట్టుకుంటోంది. వినాయకుడి తలపై శంఖం పూరిస్తున్న శివుడి విగ్రహం దర్శనమిస్తుంది. ఆర్ట్ డైరెక్టర్ల నేతృత్వంలో ఆలయ నమూనాలో వినాయక మండపాన్ని రూపొందించారు. బంగారు వర్ణంలోని స్తంభాలు, దేవతామూర్తుల విగ్రహాలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరిస్తున్నది. మండపం ఎదుట సుమారు 40 ఫీట్ల భారీ సైజులో ఏర్పాటు చేసిన బద్రీనాథ్ ఆలయ బ్యాక్‌గ్రౌండ్‌తో శివుడి విద్యుత్ దీపాల నమూనా రాత్రి పూట ఆకర్షణగా నిలుస్తోంది. మరోవైపు శివాజీ మహారాజ్ విద్యుత్ దీపాల నమూనా సైతం ఆకట్టుకుంటోంది. అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నర్సింహగౌడ్ ఉత్సవాల నిర్వహణకు నేతృత్వం వహిస్తున్నారు.



న్యూస్ బాక్స్

## తారా కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రవీణ



సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా. ప్రవీణ బాధ్యతలు స్వీకరించారు. గతంలో పూర్తి అదనపు బాధ్యతల్లో (ఎఫ్ఏసీ) ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆమె తాజాగా రెగ్యులర్ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి రావడంతో ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తారా కళాశాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు.

## రేపటి వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అడ్మిషన గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్టు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ 8008403635 నంబరును సంప్రదించాలని కోరారు.

## నేడు జిల్లా జట్టు ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ సెలెక్షనలో పాల్గొనుటకు ఈ నెల 6న జిల్లా జట్టు ఎంపికలు నిర్వహించనున్నట్టు డీవైఎస్‌వో ఖాసీంబేగ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డిలోని జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో ఎంపికలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేసే పర్మినెంట్ రాష్ట్ర ఉద్యోగులు మాత్రమే సర్వీస్ సర్టిఫికెట్, లేదా ఇటీవల తీసిన ఐడెంటిటీ కార్డుతో ఉదయం 11 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 7981798957 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

## గోపాలమిత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మాణిక్యం

పుల్‌కల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి చెందిన డప్పు మాణిక్యం గోపాలమిత్ర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన ఆ సంఘం సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంప శివకుమార్, ఉపాధ్యక్షుడిగా డప్పు మాణిక్యం, ప్రధాన కార్యదర్శిగా అలిగే శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు.

## ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా ప్రవీణ్‌కుమార్

హత్నూర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ సంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్ మాదిగ నియామకమయ్యారు. శుక్రవారం ఆ సంస్థ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ నియామక పత్రాన్ని అందజేశారు.

## సెక్యూరిటీ గార్డు పోస్టులు భర్తీ చేయాలని ధర్నా

కొల్చారం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సెక్యూరిటీ గార్డు పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కొల్చారం ఐఎంఎల్ డిపో ముందు చిన్న ఘనపూర్ యువకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఎంఎల్ డిపోలో పోస్టులను స్థానికులచే భర్తీ చేయాలని గతంలోనే డిమాండ్ చేశామన్నారు. కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిడి వల్ల అందులో ఉన్న ఐదు సెక్యూరిటీ పోస్టులను తమ అనుకున్న వారికి ఇచ్చారని ఆరోపించారు. ఐఎంఎల్ డిపోలో పని చేస్తున్న వారు కూడా తమ బంధువులను నియమించుకొని పేదల పొట్ట కొడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సెక్యూరిటీ గార్డు పోస్టులను అర్హులైన స్థానికులకు ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో గ్రామ ఉద్యమ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వచ్చి వారిని సముదాయించి ఆందోళన కార్యక్రమాన్ని విరమింపజేశారు.

## రెండోరోజుకు చేరిన మిషన్ భగీరథ కార్మికుల నిరసన

మనూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని మిషన భగీరథ కార్మికులు నిరసన కార్యక్రమం రెండవ రోజు చేపట్టారు. మనూరు మండల పరిధిలోని బోరంచ గ్రామ శివారులో ఉన్న మిషన భగీరథ కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని తీశీఎగ్రామాలకు బోరంచ నుంచి మిషన భగీరథ నీరు సరఫరా అవుతుందని, గురువారం ఇంటెక్ వెల్ నిలిపివేసి నిరసన తెలుపుతున్న సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్ ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల మిషన భగీరథ కార్మికులు పాల్గొన్నారు.

# గంగమ్మ ఒడికి గణపయ్య



జహీరాబాద్ పట్టణంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన చిన్నారిని అభినందిస్తున్న ప్రముఖులు

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తొమ్మిరోజులపాటు పూజలందుకున్న గణనాథుడు గంగమ్మ ఒడికి చేరాడు. మెదక్, కొల్చారం, కల్హేర్, సంగారెడ్డి తదితర మండలాల్లో వినాయకుల నిమజ్జనం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బాణాసంచా కాలుస్తూ, డప్పు చప్పులు, బ్యాండ్ మేళాలు, డి.జె సౌండ్, ఆట పాటలతో అట్టహాసంగా శోభా యాత్ర నిర్వహించారు. పెద్దశంకరంపేట సమీపంలోని తిరుమలాపూర్ చెరువులో వైభవంగా నిమజ్జనం చేశారు. మహిళలు కోలాటాలు చేస్తూ యువకులు నృత్యాలు చేస్తూ వినాయక నిమజ్జన ఉత్సవాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగారెడ్డి పట్టణంలోని ఎఫ్.ఆర్.ఎస్ రోడ్డు జూబ్లీ క్లబ్ ఆవరణలో శక్తి సేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిన మహబూబ్ సాగర్ చెరువులో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



మెదక్‌లో..



సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో బాల వినాయకులను నిమజ్జనం



మెదక్ పట్టణంలో గణేషుడి శోభాయాత్ర..



కల్హేర్‌లో నిమజ్జనాలకు తరలి వెళ్తున్న గణనాథులు



ర్యాలమడుగు గ్రామంలో గణనాథుడి నిమజ్జనం

## మనూరు మండలం నుంచి ముగ్గురు ఉత్తమ టీచర్లు

మనూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా మనూరు మండలం నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో రాజశేఖర్ షెట్కార్ తెలిపారు. శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవంలో మనూరు మండలంలోని ఉసిరకపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న త్రివేణి, ఎలుగోయ్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న జేసీప్రసాద్, శెల్గిర పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న డి.నర్సింలు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, డీఈవో వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సన్మానం, జ్ఞాపికను అందజేయడం జరిగిందన్నారు.



ఉత్తమ టీచర్ త్రివేణిని సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ, డీఈవో

## ఏడుపాయలలో వాహన షెడ్డు ప్రారంభం

పాపన్నపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయలలో వాహన పూజ కోసం ఓ భక్తుడు నిర్మించి ఇచ్చిన షెడ్డును శుక్రవారం ప్రారంభించారు. గొల్లపల్లికి చెందిన లోకేశ్వర్ శ్రీనివాస్ రెడ్డి తన మాతృమూర్తి జొన్న యశోద జ్ఞాపకార్థం ఏడుపాయలలో వాహన పూజ కోసం షెడ్డును ఏర్పాటు చేయడంతో పాటు దుర్గమ్మ తల్లికి 57 గ్రాముల బంగారు నెక్లెస్‌ను చేయించారు. రూ.2.60 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డుకు పూజ చేయించి, ప్రారంభించారు. ఆలయ సిబ్బందికి నెక్లెస్ అందజేశారు.



వాహన షెడ్డును ప్రారంభిస్తున్న దాత శ్రీనివాస్ రెడ్డి

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన విజయపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును శుక్రవారం నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కష్టపడి పని చేయాలని ఆయనకు సూచించారు. ఆయన వెంట పెద్దశంకరంపేట మండల పూర్వ అధ్యక్షులు కోణం విఠల్, తదితరులు ఉన్నారు.

## 'యూరియా కొరత తీర్చాలి'

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియా కొరతను తీర్చాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర రెడ్డి డిమాండ్ చేశారు. వర్షాలు సంతృప్తికరంగా కురవడంతో వరి నాట్లతో పాటు పత్తి చేలను విరివిగా వేసుకున్నారన్నారు. అయితే అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా రైతు భరోసా ఇచ్చి యూరియా మరిచారని ఆరోపించారు. యూరియా దొరకక రైతులకు భారీగా పంట నష్టం జరుగుతుందన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి యూరియాను రైతులకు కావాల్సినంతగా సరఫరా చేయాలని ఆయన కోరారు.

## మహ్మద్ ప్రవక్త జీవితం స్ఫూర్తిదాయకం

● ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబి పండుగను పురస్కరించుకొని.. ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మేరా ఇండియా సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులను అభినంఇంచారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

● ఎమ్మెల్యే సునితారెడ్డి

చిలప్‌చెడ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో శుక్రవారం బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. మండలంలోని గౌతాపూర్ గ్రామానికి చెందిన ఇండ్ల లక్ష్మికి రూ.12000, మేగ్యతండాకు చెందిన సామ్య నాయక్‌కు రూ.18000 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు.

## తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో గోపూజ, కుంకుమార్చన

చిలప్‌చెడ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో మండలం పరిధిలోని ఫైజాబాద్ గ్రామంలో శుక్రవారం గోపూజ, కుంకుమార్చన నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పూజారి అంబటి లక్ష్మీ నారాయణ, జిల్లా ఆర్గనైజర్ రాంరెడ్డి అధ్యక్షతన సత్సంగము, భజన కార్యక్రమాలు, గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించినట్లు హనుమాన భక్త మండలి సభ్యులు తెలిపారు. గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ ఆశా వర్కర్ మృతి

రామాయంపేట,సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాలికి గాయమై మెరుగైన చికిత్స అందక ఆశా వర్కర్ మృతిచెంది. వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేట మండల పరిధి ఝాన్సీ లింగాపూర్‌కు చెందిన పుష్పలత(42) కొన్ని రోజులుగా కాలికి గాయంతో బాధపడుతోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె భర్త శ్రీనివాస్ ప్రైవేటు ఆసుపత్రిలో చూపించలేకపోయాడు. దీంతో ఇన్ఫెక్షన్ పెరిగి నెల రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందింది. మృతురాలికి బాబు, పాప ఉన్నారు. విషయం తెలిసిన టిఆర్ఎస్ నేత కాంటారెడ్డి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాడు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి సంతాపం ప్రకటించారు.

## ఉపాధ్యాయ వృత్తికి సామాజిక గుర్తింపు



ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకున్న నీలం మధు

పటాన్‌చెరు సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయ వృత్తికి సామాజిక గుర్తింపు తెచ్చిన ఘనత సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు దక్కిందని కాంగ్రెస్‌పార్టీ నాయకుడు నీలం మధు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉంటూ రాష్ట్రపతిగా పదవి చేపట్టారని వివరించారు. అనంతరం ఖైరతాబాద్‌లోని వినాయకుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్, సభ్యులు వీణ మాధురి, గంగాధర్ యాదవ్, నిశాంత, మొగల్, సందీప్, రాజు, అజయ్ తదితరులు ఉన్నారు.

## బాధితులకు మొబైల్ ఫోన్లు అప్పగింత



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ గాలయ్య

అల్లాదుర్గం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లాదుర్గం పోలీస్‌స్టేషన పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను స్థానిక ఎస్ఐ శంకర్ రికవరీ చేసి శుక్రవారం బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ల ఐఎంఈఐ నంబరు ఆధారంగా వాటిని గుర్తించామన్నారు. బాధితులు ఐఎంఈఐ నంబరుతో ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## హరీశ్‌రావుపై ఆరోపణలు తగవు

● రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధనరెడ్డి



చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావుపై చేస్తున్న ఆరోపణలు తగవని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో హరీశ్‌రావు పోషించిన కీలకపాత్రను ఎవ్వరూ మరచిపోలేరని గుర్తుచేశారు. శుక్రవారం గుమ్మడిదలలో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావానికి ముందు జరిగిన ప్రతీ దశలో ఆయన ముందుండి ఉద్యమాన్ని నడిపించారని, తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఎన్నో త్యాగాలు చేశారని చెప్పారు. ప్రజలకు దగ్గరైన నాయకుడిగా హరీశ్‌రావు ఎల్లప్పుడూ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం కృషి చేశారని గోవర్ధనరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యంగా రైతుల సమస్యల పరిష్కారం, సాగునీటి ప్రాజెక్టులు, మిషన భగీరథ, మిషన కాకతీయ వంటి పథకాల రూపకల్పనలో ఆయన అహర్నిశలు శ్రమించారని గుర్తు చేశారు. ఇలాంటి నాయకుడిపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హరీశ్‌రావు లాంటి ఉద్యమ సారథులు ఉండడం బీఆర్ఎస్‌కు గర్వకారణం అని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేస్తున్న ఆరోపణలు కేవలం ప్రచారం కోసం మాత్రమే తప్ప తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. తెలంగాణ ప్రజలు వాస్తవాన్ని గ్రహిస్తారని, ఇది ప్రజలు వచ్చే ఎన్నికలలో గట్టిగా బుద్ధి చెప్తారన్నారు.

## కవిత వైఖరి వెనుక బీజేపీ హస్తం

● బీఆర్ఎస్ మైనార్టీ రాష్ట్ర నాయకుడు మోహీద్‌ఖాన్

నారాయణఖేడ్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాగృతి అధ్యక్షురాలు కవిత వైఖరి వెనుక బీజేపీ హస్తం ఉందని బీఆర్ఎస్ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు మోహీద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆమెకు అనేక అవకాశాలు ఇచ్చిందన్నారు. లిక్కర్ కేసులో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఆమెను బయటకు తీసుకురావడానికి బెయిల్ కోసం కృషి చేస్తే, కేసు నుంచి బయట పడేందుకు ఆమె బీజేపీ ఆడించినట్లు ఆడుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ ఖేడ్ మండల మాజీ అధ్యక్షుడు ప్రభాకర్, స్థానిక మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన భాసిత్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మోహీద్‌ఖాన్

## ప్రజల సంక్షేమం కోసమే జీఎస్టీ సంస్కరణలు

● బీజేపీ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశం గౌడ్



జిల్లా పార్టీ కార్యాలయం వద్ద ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల సంక్షేమం కోసం జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశం గౌడ్ పేర్కొన్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయం వద్ద ఆయన ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అలాగే నర్సాపూర్‌లో చౌరస్తా వద్ద మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సంగారెడ్డిలోని ఐబీ వద్ద జీఎస్టీ స్లాబులు తగ్గించడం పట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నరసింహారెడ్డి, నేతలు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అదేవిధంగా అల్లాదుర్గం , నిజాంపేట, నారాయణఖేడ్, చిలప్‌చెడ్ తదితర మండలాల్లో బీజేపీ నాయకులు మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

## పార్టీలు వేరైనా రైతులమంతా ఒకటే

● బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణరెడ్డి

కొండాపూర్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : పార్టీలు వేరైనా రైతాంగ సమస్యలపై రైతులమంతా సంఘటితమై పోరాడుతామని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గొల్లపల్లిలో సంఘం సభ్యులు రైతులతో కలిసి బలరాముని చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం జై జవాన్ జై కిసాన్ నినాదాలు చేసి బీకేఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణరెడ్డి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు మద్దతు ధరతోపాటు మార్కెట్‌కు ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. రైతులు తీసుకున్న పంట రుణాలను ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఖేడ్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

న్యూస్ నెట్‌వర్క్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నియోజకవర్గంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిలతో కలిసి సన్మానించారు. మెదక్ పట్టణం, నర్సాపూర్‌లో శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చేగుంటలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి చేగుంట అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు నివాళులర్పించారు. . జహీరాబాద్‌లో మాజీ మంత్రి చంద్రశేఖర్ వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సంగారెడ్డిలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ప్రభుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ : టీచర్లను సన్మానిస్తున్న మాజీ మంత్రి చంద్రశేఖర్



జహీరాబాద్ పట్టణంలోని సిద్దార్థ ఉన్నత పాఠశాలలో టీచర్లకు సన్మానం